సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025

శభాష్ దేవిసింగ్


పాఠశాల చుట్టూ కట్టించిన ప్రహరీ వద్ద దేవిసింగ్

జహీరాబాద్ టౌన్: మండలంలోని గోవింద్‌పూర్‌కు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు దేవిసింగ్ రాథోడ్ గ్రామస్తుల సహకారంతో బడిని బతికించారు. బడిలో మెరుగైన బోధన ఉంటుందని ప్రచారం నిర్వహించడంతో పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పంచాయతీ సహకారంతో కట్టించారు. సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే డిజిటల్ క్లాస్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డ్రెస్ కోడ్ అమలు చేస్తున్నారు. హెచ్‌ఎం దేవిసింగ్ పనితనం, పట్టుదల చూసి జిల్లా, మండల స్థాయి అధికారులు అభినందిస్తున్నారు. పలు మార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో కూడా బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు ఖేడ్‌కు మంత్రి దామోదర


అర్బన్‌పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఖేడ్‌కు వస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా పట్టణ శివారులో అర్బన్ పార్కు స్థలాన్ని జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి అనురాధతో కలిసి పరిశీలించారు. అనంతరం కన్వెన్షన్ హాల్, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల కోసం మా ఫంక్షన్‌హాల్, రింగు రోడ్డు వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేశ్ చౌహాన్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా కేటగిరీల వారీగా అత్యుత్తమ బోధన కనబరిచిన 102 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల వరకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని, ముఖ్య అతిథిగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతున్నట్లు చెప్పారు.

ఓపెన్ అడ్మిషన్ గడువు పెంపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు ఈనెల 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేసిన అధ్యయన కేంద్రాలను రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దేశ ప్రయోజనాలు తాకట్టు పెట్టొద్దు: సీపీఎం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అమెరికా ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో 'అమెరికా విష కౌగిలి–భారతదేశ భవిష్యత్' అనే బుక్ లెట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ నుంచి చేసుకుంటున్న దిగుమతుల మీద 50 శాతం అదనపు సుంకాలు విధిస్తామని, జరిమానాలు కూడా వేస్తామని ట్రంప్ హెచ్చరించడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మల్లేశం, మాణిక్యం, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రవీణ్ కుమార్, విద్యాసాగర్, రేవంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డిఎడ్యుకేషన్: పంచాయతీ కార్మికులను కులం పేరుతో దూషించిన కంగ్టి ఎంపీడీఓ, ఎంపీఓలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ ఏఓ ఆంథోనికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన కార్మికులను అసభ్యకరంగా తిడుతూ అవమానించారని వాపోయారు. కార్మికులను కులం పేరుతో దూషించిన అధికారులపై తక్షణం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి దాసు, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

రెండు గేట్ల ద్వారా నీరు విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఎక్కువ ఉన్నప్పుడు 7 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో 5 గేట్లను బంద్ చేసి చేశారు. ప్రాజెక్టులోకి 22112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. దిగువకు అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

సార్ సేవలకు ఇరవై ఏళ్లు

పిల్లల మధ్యే విశ్రాంత జీవితం


తిగుల్ పాఠశాలలోని విద్యార్థులతో బాల్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పదవీ విరమణ పొందిన చాలా మంది శేష జీవితం పొందుతారు. కానీ రిటైర్డు ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి మాత్రం పిల్లల మధ్యే జీవితం సాగిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన తొందూరు బాల్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా 34 ఏళ్లు పనిచేశారు. 2004లో రిటైర్డు అయ్యారు. అయినా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారు. ఏడేళ్ల పాటు ప్రయివేట్ పాఠశాలలో పనిచేశారు. అనంతరం గజ్వేల్ మండలం దాచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడేళ్లు, క్యాసారం పాఠశాలలో రెండేళ్లు, ప్రజ్ఞాపూర్ పాఠశాలలో ఏడాది, తిగుల్ ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. తెలుగు, గణితం పిల్లలకు బోధిస్తున్నారు. బాల్‌రెడ్డి సేవలకు జిల్లా విద్యాశాఖ అధికారులు, మాజీ మంత్రి హరీశ్‌రావు శాలువాతో సత్కరించి అభినందించారు. ఆరోగ్యం సహకరించినన్ని రోజులు పిల్లలకు పాఠాలు చెబుతానని తెలిపారు.

వినూత్న బోధన.. విజయాల సాధన


వినూత్నంగా బోధిస్తున్న ఉపాధ్యాయురాలు సుల్తానా

న్యాల్‌కల్(జహీరాబాద్): రేజింతల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సఫియా సుల్తానా వినూత్న పద్ధతిలో బోధిస్తున్నారు. ఆమె బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపకరణాలతో బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని నిరూపించారు. సీసీఆర్‌టీ అధికారుల ఆదేశాల మేరకు జాతీయ స్థాయిలోనూ ప్రదర్శనలు ఇచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి, కలెక్టర్ ఆమెను అభినందించారు.

ఆటో ఏర్పాటు చేసి.. హంగులు కల్పించి..



కొండపాక(గజ్వేల్): సిర్సనగండ్లలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయుడు జయప్రకాశ్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. మరోవైపు తన సొంత ఖర్చులతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా విద్యార్థుల రవాణా సౌలభ్యం కోసం ఆటో ఏర్పాటు చేశారు. క్రీడా దుస్తులు, స్వచ్ఛమైన తాగు నీటి ఆర్వో ప్లాంట్, చదువు అర్థం అయ్యేలా ఐఎఫ్‌బి స్క్రీన్ ఎల్‌ఈడీ ప్యానల్, కంప్యూటర్, తరగతి గదుల్లో కార్పెట్లు, పాఠశాలకు అందమైన రంగులు వేయడం వంటి వాటి కోసం సుమారు రూ. 9లక్షలు వెచ్చించారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా సుమారు70 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం 210 మంది విద్యార్థులకు విద్యాభ్యాసం జరుగుతోంది.


సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆటోలో వచ్చిన విద్యార్థులు

మాస్టార్లు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన
- విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న గురువులు

జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర దేవుళ్లు వారు.. సమాజ దేవాలయానికి నిజమైన రక్షకులు.. వృత్తిపట్ల అంకిత భావం.. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలన్న ఆశయం వీరి సొంతం. మూతపడే దశలో ఉన్న బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ.. వారిలో సృజనాత్మకతను గుర్తించి వినూత్న పద్ధతుల్లో బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు ఉపాధ్యాయులు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తున్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ.. వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురి గురువులపై ప్రత్యేక కథనాలు...

నాడు 7 నేడు 15


కొడిపల్లి: మాన్‌సింగ్‌తండాలో విద్యార్థులకు క్రీడాసామగ్రి అందిస్తున్న ఉపాధ్యాయుడు మాణిక్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మాన్‌సింగ్‌తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మాణిక్యం బడి బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆయన విధుల్లో చేరినప్పుడు ఏడుగురు విద్యార్థులు ఉండగా నేడు 15 మందికి చేరింది. చుట్టూ ఉన్న తండాల పిల్లలందరూ సర్కారు బడికి వచ్చేలా కృషి చేస్తున్నారు. అలాగే పాఠశాలకు రంగులు వేయించారు. విద్యార్థులు చదువుకునేందుకు పుస్తకాలు నోట్‌బుక్స్ అందించారు. విద్యార్థులకు టై, బెల్ట్, షూ, ఐడీకార్డు, డైరీ, వాటర్‌బాటిల్స్, క్రీడాసామగ్రి ఇలా తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి విద్యార్థులకు ఇచ్చారు.

పేదపిల్లల బడిపంతులుగా..


న్యూఢిల్లీలో ఇటీవల అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం సాదత్ అలీ

దుబ్బాక: విద్య, సామాజిక సేవా రంగంలో విశేషంగా కృషి చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ధర్మాజీపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మహమ్మద్ సాదత్ అలీ. చదువులో ప్రోత్సహించడం, వారికి ఫీజులు, బుక్స్, మెటీరియల్స్ అందిచడమే కాకుండా పలువురు దాతలతో సాయం అందిస్తూ పేదపిల్లల బడిపంతులుగా గుర్తింపుపొందారు. ఆయన చేస్తున్న సేవలకు గాను ఇటీవలే ఎమర్జింగ్ అచీవర్స్ అవార్డు న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సల్ చేతుల మీదుగా అందుకున్నారు. సాదత్ అలీ ఇరవై ఏళ్లుగా భౌతిక, రసాయన శాస్త్రంలో కృత్యాలు, లోక్యాస్ట్ నో క్యాస్ట్ ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

సృజనాత్మకంగా బోధిస్తూ.. ఉన్నతంగా తీర్చిదిద్దుతూ..


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న అశోక్ కుమార్ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యార్థులతో కలిసి ఆడుతారు పాడుతారు.. వారి పక్కనే నేలపై కూర్చుంటారు.. వారిని అక్కున చేర్చుకొని పాఠాలు చెబుతారు.. అందుకే ఆయనంటే విద్యార్థులకు చాలా ఇష్టం. విద్యార్థులంటే ఆయనకు ప్రాణం. ఆయనే సదాశివపేట మండలం మెలగిరిపేట్, అంకేనపల్లి, చందాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో 28 ఏళ్లుగా విధులు నిర్వహించిన హెచ్‌ఎం బి.అశోక్ కుమార్. మరోవైపు రోటరీ క్లబ్ కార్యదర్శిగా, వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. తాను పని చేసే పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు, విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, టై, బెల్ట్, గ్లాసులు, ప్లేట్స్‌తో పాటుగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అదేవిధంగా తరగతి గదులను సొంత డబ్బుతో వాల్ పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను వినియోగిస్తూ విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా సృజనాత్మకంగా బోధిస్తున్నారు. హెచ్‌ఎం అశోక్ కుమార్ సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను సైతం అందజేసింది. వచ్చే ఏడాది ఆగస్టులో అయన పదవీ విరమణ పొందనుండగా, ఇటీవల మునిపల్లికి బదిలీపై వెళ్లారు.

అందరి నేస్తం.. ఆపన్నహస్తం

- డిజిటల్ హంగులు కల్పించి..
- 74సార్లు రక్తదానం చేసి
- పాఠశాలలపై 'ప్రశాంత్' ముద్ర


ఇటీవల వజ్ర అవార్డుతో ప్రశాంత్‌కు సన్మానం..

వర్గల్ (గజ్వేల్): ఆధునిక హంగులతో చదువులకు వన్నెలద్దడమేకాకుండా.. రక్తదానాలతో స్పందించే హృదయంగా పేరొందారు వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త ప్రైమరీస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వరాల ప్రశాంత్. 2002లో నాచారం స్కూల్ టీచర్‌గా, శాకారం హెచ్‌ఎంగా, ప్రస్తుతం చాంద్‌ఖాన్‌మక్త హెచ్‌ఎంగా కొనసాగుతున్న ప్రశాంత్ ఆయా పాఠశాలలపై తనదైన ముద్ర వేశారు. సొంతంగా డబ్బు వెచ్చిస్తూనే, మిత్రులు, దాతల సహకారంతో డిజిటల్ క్లాస్‌రూమ్స్, తరగతి గోడలకు బోధన సంబంధ అంశాలతో ఎనామిల్ పెయింటింగ్స్, ఆకట్టుకునే బొమ్మలతో బడి వాతావరణాన్ని చదువుల నెలవుగా తీర్చిదిద్దారు. విద్యార్థులలో సామాజిక స్పృహ పెంపొందింపజేస్తూ.. శాకారం స్కూల్‌ను నందనవనంగా తీర్చిదిద్దారు. ఆయన కృషిని అభినందిస్తూ 2020–21 'రైస్ అండ్ షైన్' ఎస్‌సీఈఆర్‌టీ జాతీయస్థాయి మ్యాగజైన్‌లో శాకారం పాఠశాల సక్సెస్‌స్టోరీ ప్రచురితం చేశారు. రేడియో పాఠాల రూపకల్పన, ఉపాధ్యాయ శిక్షణ మాడ్యూల్స్ తయారీ, పాఠ్యపుస్తకాల రచనలోనూ ప్రశాంత్ భాగస్వామిగా నిలిచారు.

పిల్లల మానసిక అభివృద్ధికి..

గత వేసవి సెలవులలో మొబైల్ ఫోన్లకు పిల్లలు అతుక్కుపోకుండా ఉండడానికి పిల్లల శారీరక మానసిక అభివృద్ధికి డిజిటల్ డీటాక్స్ పేరుతో 21రోజులు, 21 రకాల కార్యక్రమాలతో సమాజానికి సరికొత్త విధానం పరిచయం చేశారు. అతని సేవలకు గుర్తింపుగా 2021లో మండల స్థాయి, 2022లో జిల్లా స్థాయి, అదేసంవత్సరం రాష్ట్రస్థాయి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అవార్డు, 2023లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. తాజాగా 2025 జూన్‌లో సేవారంగంలో వజ్ర పురస్కారం సొంతమైంది. కేవలం బోధనకే పరిమితం కాకుండా 74 సార్లు రక్తదానం, 3 సార్లు ప్లేట్‌లెట్లు దానం చేసి ఆపదలో స్పందించే హృదయంగా పేరొందారు. అటు చదువులకు, సమాజానికి ఉపయుక్తంగా నిలుస్తూ అందరి నేస్తంగా అభినందనలు చూరగొంటున్నారు.

కళాకారుడిగా రంగులద్ది.. గురువుగా మెరుగులు దిద్ది


బొమ్మలతో అక్షరాలు నేర్పుతూ..

పాపన్నపేట(మెదక్): ఆటపాటలతో విద్యార్థులను అక్కున చేర్చుకుంటూ.. వినూత్న బోధనలతో ఆకట్టుకుంటూ.. చిన్నారుల భవితకు బంగారు బాటలు వేస్తున్నారు ఉపాధ్యాయుడు ఆశన్నగారి మల్లేశం. ఇతను మెదక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ పాఠశాలలో 2012లో టీచర్ వృత్తిలోకి ప్రవేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచే ఉద్దేశ్యంతో గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి మీ పిల్లల బాధ్యత మాది అంటూ భరోసా ఇచ్చి వారి పిల్లలను సర్కార్ బడిలో చేర్పించారు. దీంతో వెలవెలబోయిన పాఠశాల కొద్ది రోజుల్లోనే కళకళ లాడింది.

కుర్తివాడ బడి రూపురేఖలు మార్చి..

బదిలీపై కుర్తివాడ వచ్చిన ఆయన కొద్ది రోజుల్లోనే బడి రూపం మార్చారు. పాఠశాలకు పెయింటింగ్‌లతో కొత్త కళను తెచ్చారు. చాలా మంది తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించారు. ఆటల్లో.. చదువుల్లో.. సాంస్కృతిక కార్యక్రమాల్లో.. మాకెవరు లేరు పోటీ అనేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు మల్లేశం.

రవిరాజ్ బోధనకు ప్రపంచస్థాయి ప్రశంసలు

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రవిరాజ్ వినూత్న రీతిలో యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యాబోధన చేస్తూ ప్రపంచ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. నర్సాపూర్ మండలం అద్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రవిరాజ్ బోధనలో కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. 2008 డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికై ఉమ్మడి మెదక్ జిల్లా కంగిటి మండలం చౌకన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. 43 మంది విద్యార్థులతో కొనసాగుతున్న పాఠశాలలో 104 మంది విద్యార్థుల సంఖ్యను పెంచి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు పొందారు. 2004లో అద్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీపై వచ్చినప్పుడు 53 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 70కి పైగా విద్యార్థుల సంఖ్యను పెంచి తన ప్రత్యేకతను చాటారు. నెల రోజుల క్రితం సొంతంగా లక్ష రూపాయలతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, టై బెల్టులు, ఆట వస్తువులు డీఈఓ రాధాకిషన్ చేతుల మీదుగా అందజేశారు.


వినూత్న రీతిలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు రవిరాజ్

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈఓ వెంకటేశ్వర్లు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులు బాగా చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని తొగర్‌పల్లి పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే తొలిమెట్టు పదో తరగతి అని తెలిపారు. ఏ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు వెళ్లినా పదో తరగతి మార్కులను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారని వివరించారు. వందశాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు సైతం తమ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం పక్కనే శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..


వాకిటి శ్రీదేవి


డా. సదయ్‌కుమార్

సంగారెడ్డిఎడ్యుకేషన్/జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయో సైన్స్ ఉపాధ్యాయురాలు వాకిటి శ్రీదేవి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. 14 సంవత్సరాలుగా విద్యారంగంతో పాటు కండర క్షీణత వ్యాధిగ్రస్తులకు ఆమె అనేక రకాలుగా సేవలందిస్తున్నారు. అలాగే సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదయ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. బోధనలో ఆధునిక పద్ధతులను అనుసరించడంతో పాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సామాజిక సేవలో భాగస్వాములు చేశారు.

పేదల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందించాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ


మెడికల్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర, చిత్రంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు

సంగారెడ్డి: పేదల నమ్మకాన్ని వమ్ము చేయొద్దని, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రిటికల్ కేర్ బ్లాక్, మెడికల్ కాలేజీ, హాస్టల్స్‌ను ప్రారంభించారు. అలాగే 500 పడకల సామర్థ్యం గల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎన్ని కోట్లయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి గుర్తింపు పొందాలని విద్యార్థులకు సూచించారు. సీఎస్ఆర్ నిధులను మౌలిక వసతుల మెరుగు కోసం ఉపయోగించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. యువ డాక్టర్లు అందరూ రాజకీయాల్లోకి రావాలని, విద్యావంతులు వస్తే దేశం మరింత పురోగతి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మాణిక్‌రావు, ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, వైద్య కళాశాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

జోగిపేట(అందోల్): విద్యాసంస్థల్లో మున్సిపల్‌శాఖ భాగస్వామ్యం అవసరమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని అందోలు, చౌటకూరు మండలాల్లో రూ. 31.24 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గంలో విద్యా ప్రగతికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో విద్యాసంస్థల్లో శానిటేషన్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇళ్లను మంత్రి ఘనంగా ప్రారంభించారు.

క్లుప్తంగా

తహసీల్దార్ ఎదుట యువకుల బైండోవర్

మద్దూరు(హుస్నాబాద్): పోలీసుల విధులకు ఆటంకం కలిగించి ఎనిమిది మంది యువకులను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 2న హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్ నైట్ డ్యూటీ చేస్తుండగా.. దూల్మిట్ట మండలంలోని శిబ్బితండాకు చెందిన యువకులు గణేష్ నిమజ్జనం కోసం ఊరేగింపు చేస్తున్నారు. ఈ క్రమంలో డీజే సౌండ్ ఎక్కువగా వినిపించడంతో సౌండ్‌ను బంద్ చేయాలని సూచించాడు. దీంతో ఎస్ఐపై యువకులు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కల్పించారు. ఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది మంది దూల్మిట్ట తహసీల్దార్ మదుసూదన్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

108లో గర్భిణి ప్రసవం

గజ్వేల్‌రూరల్: ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణిని బుధవారం రాత్రి 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో పండంటి బాబుకు జన్మనిచ్చింది. వివరాల ప్రకారం.. తొగుట మండలం లింగాపూర్‌కు చెందిన గర్భిణి పూజ పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వెంటనే 108 ఈఎంటీ జ్యోతి, పైలెట్ వంశీలు లింగాపూర్ నుంచి పూజను మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రెండో కాన్పులో పండంటి బాబుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వెంటనే ఇద్దరిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని బోజ్యా తండాలో చెత్త తరలించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాల ప్రకారం.. బోజ్యా పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ఇంజన్‌ను డ్రైవర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ ఉంచగా.. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీని దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం చోరీ విషయంపై గ్రామ కార్యదర్శి వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా.. టిప్పర్ పట్టివేత

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చిన్నకోడూర్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామ శివారులోని రాజీవ్‌రహదారి ఆవరణలో ధనలక్ష్మీ పెట్రోల్ బంక్ వద్ద నిలిచిన టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఇసుకను గోదావరిఖని నుంచి హైదరాబాద్ తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. అయితే తనిఖీ చేస్తుండగా డ్రైవర్ పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.

కారును ఢీ కొట్టిన డీసీఎం

టీస్టాల్‌లోకి దూసుకెళ్లిన వాహనాలు

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల టీ జంక్షన్ దగ్గర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. వేగంగా వస్తున్న డీసీఎం ఎదురుగా ఉన్న కారును ఢీకొట్టడంతో కారుతో పాటు డీసీఎం రోడ్డు పక్కన ఉన్న టీస్టాల్‌లోకి దూసుకెళ్లాయి. వివరాల ప్రకారం.. మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు ఏడుపాయల టీ జంక్షన్ వద్ద గురువారం హైదరాబాదు నుంచి టార్పాలిన్ లోడ్‌తో డీసీఎం వెళ్తుండగా.. ముందు స్విఫ్ట్ కారు వెళ్తుంది. అయితే ఏడుపాయల టి జంక్షన్ వద్ద కారు డ్రైవర్ సడెన్‌గా మలుపు తిప్పాడు. దీంతో డీసీఎం అదుపుతప్పి కారును ఢీ కొట్టుతూ రోడ్డుపక్కన ఉన్న టీస్టాల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో టీస్టాల్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఇంటిపై దాడి..

ఇద్దరిపై కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన ఓ ఇంటిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబుబ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నరేశ్(25), శిరీష(21)లు ఈనెల 1వ తేదిన ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే తమ కుమార్తెకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్నాడని నరేశ్‌పై శిరీష కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే యువతి తండ్రి కృష్ణమూర్తి, సోదరుడు ఆంజనేయులు నరేశ్ ఇంటిపై దాడి చేయగా.. యువకుడి తల్లితో పాటు చెల్లెలు గాయపడినట్లు తెలిపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బడులకు రేటింగ్!

- ఈనెల 30 వరకు దరఖాస్తులకు గడువు
- ఎంపికైన పాఠశాలలకు నగదు పురస్కారం

స్వచ్ఛ పాఠశాలలకు ప్రోత్సాహం

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్య, మౌలిక వసతులు కల్పనతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణ పరిస్థితులు కలిగిన పాఠశాలలకు కేంద్రం ప్రోత్సాహం అందించనుంది. ప్రతి ఏడాది స్వచ్ఛ పాఠశాలలకు నగదు పురస్కారాలను అందిస్తుంది. ఎస్‌హెచ్‌వీఆర్(స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్) పేరుతో జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాలు అందిస్తుంది. ఇందులో భాగంగానే 2025–26 ఏడాదికి గాను పురస్కారాల ఎంపిక కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్‌హెచ్‌వీఆర్ యాప్ ద్వారా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకునే అంశాలపై ఎంఈఓలు, ఆర్‌పీలు సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.



మిర్జాపూర్(బి) పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లా వ్యాప్తంగా 864 ప్రాథమిక, 187 ప్రాథమికోన్నత, 211 ఉన్నత పాఠశాలలు, 22 కేజీబీవీలు, 10 మోడల్, 109 గురుకుల, సాంఘీక సంక్షేమ తదితర ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు సుమారు 500 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.40లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌లో పాఠశాల వివరాలు నమోదు చేసే అంశాలపై ఎంఈఓలు, శిక్షణ పొందిన ఆర్‌పీలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

ఆరు అంశాలు.. అరవై ప్రశ్నలు

యాప్‌లో పాఠశాలకు సంబంధించిన నీటివసతి, మరుగుదొడ్లు, చేతుల శుభ్రత, విద్యార్థుల నడవడిక, కార్యకలాపాలు, నిర్వహణ, ప్రకృతి పర్యావరణం వంటి ఆరు అంశాలకు సంబంధించి అరవై ప్రశ్నలు ఉంటాయి. నీటివసతికి (22 పాయింట్లు)1నుంచి 9 ప్రశ్నలు, మరుగుదొడ్ల వినియోగం (27పాయింట్లు) 10 నుంచి 21 ప్రశ్నలు, చేతులు కడుక్కోవడం(14పాయింట్లు) 22 నుంచి 27 ప్రశ్నలు, కార్యక కలాపాల నిర్వహణ (21పాయింట్లు)28 నుంచి 40 ప్రశ్నలు, ప్రవర్తన సామర్థ్య నిర్మాణం (20పాయింట్లు) 41 నుంచి 49 ప్రశ్నలు, ప్రకృతి పర్యావరణానికి సంబంధించి(21పాయింట్లు) 50 నుంచి 60 ప్రశ్నలకు ఆన్ లైన్‌లో సమాధానాలు ఇవ్వాలి. మొత్తం 125 పాయింట్లు కేటాయింపు ఉంటుంది. పూర్తి సమాచారాన్ని నమోదు చేసి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

పాయింట్ల కేటాయింపు..

పాయింట్స్	స్టార్స్
90 - 100	5
75 - 89	4
51 - 74	3
35 - 50	2


పాఠశాలకు రూ.లక్ష నగదు

పాఠశాలల ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాల ప్రకారం పాయింట్లు కేటాయింపు ఉంటుంది. అందులో అధిక స్టార్స్ వచ్చిన పాఠశాలలను జిల్లా తనిఖీ బృందం సందర్శిస్తుంది. ఇందులో 8 పాఠశాలలను తనిఖీ చేసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తుంది. అనంతరం రాష్ట్రస్థాయిలో పరిశీలన బృందం పరిశీలించి తుది జాబితాను జాతీయ స్థాయికి పంపిస్తుంది. చివరగా ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష నగదు ప్రొత్సాహక బహుమతిని ప్రభుత్వం అందజేస్తుంది.



న్యాల్‌కల్‌లో ఎస్‌హెచ్‌వీఆర్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ, ఆర్‌పీ

యాప్‌లో రిజిస్ట్రేషన్ ఇలా...



ఎస్‌హెచ్‌వీఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాలలను ఎంచుకున్న తర్వాత సైన్ అప్‌ను క్లిక్ చేయాలి. ఆ తర్వాత పాఠశాల యూడైస్ కోడ్‌ను నమోదు చేసి క్యాప్‌చర్‌ను ఎంటర్ చేసి కంటిన్యూను క్లిక్ చేయాలి. దీంతో యూడైస్‌లో యూజర్ ఐడీ(స్కూల్) నమోదు చేసిన మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. అనంతరం ఓటీపీ సబ్మిటచేసిన వెంటనే పాఠశాలకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. చివరగా అన్ని వివరాలు చెక్ చేసుకొని పాస్ వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి.

అవగాహన కల్పించాం



మండల కేంద్రంలో ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌వీఆర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాం. పాఠశాలల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను యాప్‌లో నమోదు చేయాలి. తప్పుడు సమాచారం నమోదు ఎట్టి పరిస్థితుల్లోను చేయరాదని వివరించాం.

– మురళి, ఆర్‌పీ, న్యాల్‌కల్

30 లోగా దరఖాస్తులు పూర్తి చేయాలి



ఎస్‌హెచ్‌వీర్ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈనెల 30లోగా తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలి. ఇందులో ఎవరికి మినహాయింపు లేదు. దరఖాస్తులో వాస్తవ పరిస్థితులను మాత్రమే నమోదు చేయాలి. జిల్లాలో 8 పాఠశాలలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికచేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

పత్తి పంటలో గంజాయి సాగు

- రూ.8.9 లక్షల విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం
- నిందితుడి రిమాండ్

వట్‌పల్లి(అందోల్): గుట్టు చప్పుడు కాకుండా పత్తి పంటలో అంతర పంటగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను గురువారం జోగిపేట ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దరఖాస్తుపల్లికి చెందిన కలాలి యాదాగౌడ్ తన వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి సాగుచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. పత్తి పంటలో ఎకరం పొలంలో సాగు చేస్తున్న 89 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.8.9 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం యాదాగౌడ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి సాగుచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు విజయ్‌కుమార్, సందీప్, కానిస్టేబుల్స్ ముఖీం, విక్రం, శ్రీధర్, నాగయ్య, కృష్ణ, పాండరీ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

ప్రేమ విఫలమైందని యువతి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): ప్రేమ విఫలమైందని ఓ యువతి మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లపల్లి తండాకు చెందిన యువతి సక్కుబాయి(21) ఎంబీఏ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుంది. అయితే ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణఖేడ్‌కు చెందిన సుధాకర్ అలియాస్ సిద్దును ప్రేమిస్తున్నానని, అతడినే పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులను చెప్పింది. కుటుంబ సభ్యులు గోత్రాలు పరిశీలించగా.. వరుసకు అన్నాచెల్లెలు అవుతారని మందలించారు. ఆ తర్వాత పది రోజుల క్రితం ఉద్యోగం చేస్తానని తల్లిదండ్రులకు చెప్పగా.. మళ్లీ మందలించారు. దీంతో మనస్థాపం చెందిన యువతి ఈ నెల 1న ఇంట్లో పురుగుల మందు తాగింది. తొలుత నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి బహుదూర్‌పల్లిలోని ఎస్‌వీ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో బుధవారం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. మృతిరాలు తండ్రి కేశ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.



సక్కుబాయి(ఫైల్)

అప్పు తీర్చలేక రైతు..

వెల్దుర్తి(తూప్రాన్): అప్పులు అధికమవడంతో వాటిని తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని శేరీలకి చెందిన చీకూరి అలియాస్ మీర్జపల్లి బాబు (40), శేకమ్మ భార్యాభర్తలు. వీరు గతేడాది ఎకరన్నర భూమితోపాటు ట్రాక్టర్ కొనుగోలు చేశారు. అలాగే ఇటీవల కొత్త ఇంటికి ప్లాస్టరింగ్ పనులు చేయించడంతో రూ. 20 లక్షల వరకు అప్పుల య్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో కొంత భూమిని అమ్మకానికి పెట్టాడు. అయితే ఆ భూమిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అప్పులు ఎలా తీర్చాలోనని కొంతకాలంగా బాబు దిగులు చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం మండల శివారులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఓ చెట్టు కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా.. వారంతా అక్కడికి చేరుకొని బోరున విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరి యా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.



మీర్జపల్లి బాబు

ఫోన్ హ్యాక్ చేసి రూ.1.50 లక్షలు కాజేశారు

పటాన్‌చెరు టౌన్: ఓ ప్రైవేటు ఉద్యోగి ఫోన్ హ్యాక్ చేసి రూ.1.50లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి గత నెల 27న తన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి రూ.1.50లక్షలు కాజేశారు. దీంతో బాధితుడు తన ఫోన్ హ్యాక్ గురైందని బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి తన ఖాతాను బ్లాక్ చేయించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గురువారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జీపీఓలు వస్తున్నారు!

- ఉమ్మడి జిల్లాకు 482 మంది ఎంపిక
- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు

సాక్షి, సిద్దిపేట: గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గ్రామ పాలనాధికారులను(జీపీఓ)లను నియమిస్తోంది. వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థలను 2022లో రద్దు చేసి అర్హత ఆధారంగా పలు శాఖలలో వివిధ పోస్టులలో భర్తీ చేశారు. అనంతరం ఆసక్తి ఉన్న పూర్వ వీఆర్ఏ, వీఆర్ఓల నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హత పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 482 మంది ఎంపికవ్వగా.. వీరందరూ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాలు అందుకోనున్నారు.

756 క్లస్టర్లుగా విభజన

దాదాపు 5వేల ఎకరాల భూ విస్తీర్ణం ప్రకారం క్లస్టర్లుగా విభజించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 756 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో జీపీఓను నియమించనున్నారు. ఈ క్రమంలోనే జిల్లా నుంచి 482 జీపీఓలుగా ఎంపికయ్యారు. సంగారెడ్డి జిల్లాలో 239 మంది జీపీఓలుగా ఎంపిక చేయగా.. 20 మంది మెదక్, మరో పది మందిని ఇతర జిల్లాలకు కేటాయించారు. సిద్దిపేట జిల్లాలో 146 మంది ఎంపికవ్వగా.. మరో నలుగురిని ఇతర జిల్లాల నుంచి కేటాయించారు. ఇక, ఉమ్మడి మెదక్‌లో 274 క్లస్టర్లకు ఖాళీలుండనున్నాయి.



జిల్లా	క్లస్టర్లు	జీపీఓలు
సిద్దిపేట	246	150
మెదక్	185	113
సంగారెడ్డి	325	209


సంతోషంగా ఉంది



మా మాతృ శాఖకు తిరిగి వెళ్లడం సంతోషంగా ఉంది. మూడేళ్లు ఇతర శాఖలో పని చేసిన సర్వీస్, రెవెన్యూలో చేసిన పాత సర్వీస్‌ను సైతం పరిగణలోకి తీసుకోవాలి. పాత సర్వీస్‌ను ఫారెన్ సర్వీస్‌గా పరిగణించి పదోన్నతులు, సర్వీస్‌ల్లో కలపాలి.

– వేణు, మెదక్

అన్ని ఏర్పాట్లు చేశాం



జీపీఓ నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందజేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులను తరలించేందుకు మూడు ప్రత్యేక బస్సులను సిద్ధం చేశాం. ఈ కార్యక్రమానికి తరలించేందుకు పది మంది అధికారులను నియమించాం.

– అబ్దుల్ హమీద్, అదనపు కలెక్టర్, సిద్దిపేట

ఆటో ఢీకొని మహిళ మృతి

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం శివారులో గురువారం బైక్‌పై నుంచి దిగి నిల్చున్న ఓ మహిళను ఆటో ఢీకొట్టగా మృతి చెందింది. తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాలకి చెందిన సుజాత (45) తన చిన్న కొడుకు వినీల్‌తో కలిసి సిద్దిపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నారు. ఘనపురం శివారులోని శారదాంబ రైస్ మిల్ వద్ద ఓ కుక్క అడ్డం రాగా కుమారుడు సడెన్ బ్రేక్‌వేయడంతో ఆమె దిగి నిల్చుంది. ఇదే సమయంలో ఆటో ఆమెను ఢీకొట్టడంతో ఆమె తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా.. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

వైద్యుడిపై దాడి.. కేసు నమోదు

సిద్దిపేటకమాన్: మిరుదొడ్డి మండలానికి చెందిన నవనీత (45)ను అనారోగ్యంతో ఆగస్టు 29న సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల చికిత్స అనంతరం ఈ నెల 2న గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయాన్ని వైద్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం మృతురాలి బంధువులు జనరల్ మెడిసిన్ విభాగం డాక్టర్ బాలుపై దాడి చేశారు. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చినట్లు వన్ టౌన్ సీఐ తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ పంతులమ్మగా రేఖ



రేఖ

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 13 ఏళ్లుగా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న రేఖ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. 2022లో ఈ పాఠశాలకు ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రావు రూ.60లక్షలు అందించగా.. నూతన గదులు నిర్మించి విద్యార్థులకు విద్యను బోధించారు. దీంతో గతేడాది పదో తరగతి ఫలితాల్లో ఐదుగురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు దాతల సహకారంతో ఒక్కో విద్యార్థికి రూ.20వేల చొప్పున ప్రోత్సాహం అందించారు. అలాగే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సిద్ర 578 మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా రూ.10 వేల నగుదు అందుకున్నారు. ప్రతి ఏడాది సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సాయిలు



సాయిసిరి

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని గాజుల గూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిసిరి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక య్యారు. 27 ఏళ్లుగా విద్యాశాఖలో సేవలతో పాటు సినీ గేయ రచయితగా, విద్యాశాఖ మార్గదర్శిగా నిరవధిక సేవలందిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను పరిపూర్ణ వికాస వంతులుగా తీర్చిదిద్దడానికి చేస్తున్న కృషిని గుర్తించి విద్యాశాఖ ఆయనను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని టీజీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజీలో గురువారం స్థానిక భరోసా కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ మహేందర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ పద్ధతులను ప్రదర్శించారు. ఫిల్లిస్ క్రిస్టల్ మెథడ్ ద్వారా మానసిక శాంతి, అవగాహన పెరుగుతుందని వివరించారు. ఈ పద్ధతులను విద్యార్థులు ప్రతిరోజూ సాధన చేసేలా పీఈటీ టీచర్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అలాగే విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. యువతకు చట్టపరమైన అవగాహన, భద్రతా చర్యలు, మానసిక ఆరోగ్య పద్ధతులపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత, కౌన్సిలర్ సౌమ్య, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు

ముందస్తుగా 'మహమ్మారి' గుర్తించొచ్చు!

డీప్ లెర్నింగ్ ఆధారిత వ్యవస్థను రూపొందించిన విద్యార్థి

పటాన్‌చెరు: కోవిడ్–19 వంటి మహమ్మారిలను ముందుస్తుగా గుర్తించేలా డీప్ లెర్నింగ్ ఆధారిత ముందస్తు అంచనా వ్యవస్థను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని పరిశోధక విద్యార్థి రాజేందర్ అభివృద్ధి చేశారు. 'టైమ్ సిరీస్ ఫోర్కాస్టింగ్, డీప్ న్యూరల్ నెట్ వర్కులను ఉపయోగించి కోవిడ్–19 డేటా యొక్క విశ్లేషణాత్మక అధ్యయనాన్ని' ఆయన విజయవంతంగా పూర్తి చేసినట్లు గణితం, గణాంక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పరిశోధన ఆరోగ్య సంరక్షణ విశ్లేషణల్లో అధునాతన గణన పద్ధతుల పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తోందన్నారు.



రాజేందర్, పరిశోధక విద్యార్థి

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మడూర్ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): నిర్మల్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని మడూర్ జెడ్పీపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, పీడీ డాక్టర్ నరేష్ తెలిపారు. చేగుంట మండల కేంద్రంలో యోగాసన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో 10వ తరగతి విద్యార్థి రాజమల్లు, జూనియర్ విభాగంలో 8వ తరగతి విద్యార్థులు అశ్వంత్, సాయిచందులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన మడూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు

పోరాటాన్ని వక్రీకరిస్తే చరిత్ర క్షమించదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్

చేర్యాల(సిద్దిపేట): ఆనాడు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన రైతాంగ సాయుధ పోరాట వారసులే కమ్యూనిస్టులని, అలాంటి పోరాటాలను వక్రీకరిస్తే చరిత్ర క్షమించదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. గురువారం స్థానిక భద్రకాళి పంక్షన్ హాల్‌లో చేర్యాల పట్టణ, రూరల్ మండల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 'కమ్యూనిస్టు ఉద్యమ విశిష్టత–పార్టీ నిర్మాణం'పై బోధించారు. జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట బైరాన్‌పల్లి అమరుల సంస్మరణ సభ బైరాన్‌పల్లిలో జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేర్యాల నుంచి బైరాన్‌పల్లి వరకు బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. శిక్షణ తరగతులకు జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా.. నాయకులు యాదవరెడ్డి, శశిదర్, యాదగిరి, అరుణ్, కృష్ణారెడ్డి, కుమార్, రవీందర్, షఫీ, ప్రశాంత్, నాగరాజు, రాజు, శోభ, ఇస్తారీ, శ్రీహరి పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అబ్బాస్

అనుమానాస్పదంగా మూడు నెమళ్ల మృతి

దుబ్బాకటౌన్: అనుమానాస్పదంగా మూడు నెమళ్లు మృతి చెందిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట–పెద్దచీకోడ్ రహదారిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చపేట నుంచి పెద్దచీకోడ్ వెళ్లే దారిలో వ్యవసాయ పొలాల సమీపంలో 3 నెమళ్లు మృతి చెందాయి. ఈ విషయాన్ని గుర్తించిన కొంత మంది యువకులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న దుబ్బాక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది నెమళ్ల కళేబరాలను పరిశీలించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని సమీపంలోని అడవికి తీసుకెళ్లారు.ఈ మేరకు శవ పరీక్ష నిర్వహించి ఖననం చేశారు. నెమళ్ల మృతి వివరాలు శవ పరీక్ష ఫలితాల్లో వెల్లడవుతుందని ఫారెస్టు అధికారులు తెలిపారు.